ప్రజాపాలన కాదు.. నయా దేశ్‌ముఖ్ పాలన

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ సరికాదు
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

యాదాద్రి భువనగిరి, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. నయా దేశ్‌ముఖ్ పాలన అని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే నెపంతో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కమీషన్లు, ఢిల్లీకి పంపే మూటలపై సభలో చర్చకు రావద్దనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలన చేతగాక, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. జనం పక్షాన ఉంటూ పోరాటం చేస్తున్న ఎమ్మెల్యేను సస్పెండ్ చేయడం సిగ్గు మాలిన చర్యగా అభివర్ణించారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని ప్రయత్నం చేస్తున్న దగుల్బాజీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఒక్క గొంతు నొక్కినంత మాత్రాన పోరాటం ఆగదని, ప్రభుత్వ వైఫల్యాలపై సభలో, బయట నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలనను ఎండగడుతూనే ఉంటామని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి శంకరగిరి మాన్యాలే అని ధ్వజమెత్తారు.

జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

- యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

యాదగిరిగుట్ట, మార్చి 14 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై ప్రభుత్వం విధించిన అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య డిమాండ్ చేశారు. సస్పెన్షన్‌ను నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య మాట్లాడుతూ ప్రశ్నించే గొంతును నొక్కే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. సస్పెన్షన్ ఎత్తివేసే వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు పేరబోయిన సత్యనారాయణ, ముక్కర్ల సతీశ్ యాదవ్, ఆరె శ్రీధర్, దండెబోయిన వీరేశం, గడ్డం చంద్రం, ఆకుల శ్రీనివాస్, రాజేశ్ యాదవ్, రాజేశ్ పాల్గొన్నారు.

'స.హ. చట్టం అమలులో ప్రభుత్వాలు విఫలం'

రామన్నపేట, మార్చి 14 : సమాచార హక్కు చట్టం అమలు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆర్టీఐ యాక్టివిస్ట్ ఫోరం చైర్మన్ బత్తుల గణేశ్ అన్నారు. రామన్నపేటలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పారదర్శకత, జవాబుదారీతనం పెంపొదించడం కోసం ఎన్నో సంవత్సరాలు పోరాటం చేసి తెచ్చుకున్న చట్టాన్ని ప్రభుత్వాలు పూర్తిగా అమలు చేయకుండా నీరు గారుస్తున్నాయన్నారు. సమాచార హక్కు చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం అయ్యారని విమర్శించారు. కార్యాలయాల్లో సమాచార అధికారులు అంటూ బోర్డులకు పరిమితం చేశారు తప్ప.. ఆచరణలో లేదన్నారు. అన్ని జిల్లాల్లో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో బట్టల దుకాణంలో మంటలు

- రూ.3లక్షల విలువైన బట్టలు దగ్ధం

మంటల్లో కాలిపోయిన బట్టలు

వలిగొండ, మార్చి 14 : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మండల కేంద్రంలోని ఓ బట్టల దుకాణంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3లక్షల విలువైన బట్టలు కాలిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని దొంత శ్యామ్‌సుందర్ తన బట్టల దుకాణాన్ని శుక్రవారం హోలీ సందర్భంగా మూసివేశారు. సాయంత్రం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పై రూములో అంటుకున్నాయి. చుట్టుపక్క షాపుల వాళ్లు చూసి శ్యామ్‌సుందర్‌కు సమాచారం అందజేశారు. వెంటనే వచ్చిన యజమాని విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే రూ.3లక్షల విలువైన బట్టలు దగ్ధమయ్యాయని బాధితుడు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

గోకారంలో పోలీసులు సీజ్ చేసిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

వలిగొండ, మార్చి 14 : మూసీ నది పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలించి మండలంలోని గోకారం గ్రామంలో ఏర్పాటు చేసిన డంప్‌ను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోకారం గ్రామానికి చెందిన ఎర్ర రామంజీ, ఎర్ర శ్రీశైలం ట్రాక్టర్ల ద్వారా ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా మూసీ నది పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులు శుక్రవారం దాడి చేసి సుమారు 35 టన్నుల ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. 2 ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

చౌటుప్పల్ రూరల్, మార్చి 14 : రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా గౌరెల్లి గ్రామానికి చెందిన చెంచల అశోక్ (48) చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో పని చేస్తున్నాడు. గురువారం పని ముగించుకొని ఇంటికి తన బైక్‌పై వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి ఇండస్ట్రియల్ పార్కులోని గోడకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను హైదరాబాద్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాదారుడి అరెస్టు

చౌటుప్పల్ రూరల్, మార్చి 14 : మండలంలోని నేలపట్ల గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న దేశపాక భాస్కర్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వలిగొండ మండలం గోకారం గ్రామ చెరువు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తీసుకొచ్చి చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలో విక్రయిస్తున్నాడు. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ కె.యాదగిరి తెలిపారు.

కొండచిలువలు సంచారం.. భయాందోళనలో జనం

గొర్రెను మింగడానికి ప్రయత్నిస్తున్న కొండచిలువ

తిరుమలగిరి(సాగర్), మార్చి 14 : మండలంలోని చింతలపాలెం గ్రామంలోని అటవీ ప్రాంతంలో కొండ చిలువల సంచారం ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. గొర్రెలు, మేకల కాపరులకు ఇటీవల కొండచిలువలు కనిపిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సమీప అటవీ ప్రాంతంలో గొర్రె మేస్తుండగా కొండ చిలువ దాడి చేసింది. గొర్ల కాపరి అప్రమత్తమై తరిమికొట్టడంతో గొర్రెను వదిలేసింది.

పంట చేను పశువుల మేతకు..

- ఏడు ఎకరాలు సాగు చేస్తే.. ఐదెకరాలు ఆగమాయె



నీళ్లు లేక ఎండిపోయిన పొలంలో పశువులను మేపుతున్న రైతు బుచ్చిరెడ్డి

చుక్క నీరు పడని బుచ్చిరెడ్డి వేసిన బోరు

ఆత్మకూరు (ఎం), మార్చి 14 : నీళ్లు లేక చేతికొచ్చే దశలో వరి చేలు ఎండిపోయి పశువుల పాలవుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన రైతు నరాల బుచ్చిరెడ్డి తనకున్న ఏడు ఎకరాలలో వరి సాగు చేశాడు. వ్యవసాయ బావితోపాటు బోర్లలో నీళ్లు రాకపోవడంతో ఇప్పటికే ఐదు ఎకరాల్లో పంట ఎండిపోయింది. ఐదు బోర్లు ఉంటే ఒక్క బోరు మాత్రమే ఆగి ఆగి పోస్తుంది. వారం రోజుల క్రితం రూ.50వేలు పెట్టి బోరు వేసినా చుక్క నీరు రాలేదు. లక్ష రూపాయలతో బావిలో పూడిక తీసినా నీళ్ల జాడే కనబడలేదు. ఇక చేసేదేమీలేక ఎండిన పొలంలో బాధతో పశువులను మేపుతున్నాడు. గతంలో పుష్కలంగా నీళ్లు, నాణ్యమైన విద్యుత్ ఉండడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏడు ఎకరాల్లో పంటలు బాగా పండినట్లు రైతు బుచ్చిరెడ్డి తెలిపాడు. ఇప్పుడు అదే ఆశతో రూ.2.50లక్షల పెట్టుబడి పెట్టి సాగు చేస్తే నీళ్లు లేక చేతికొచ్చిన ఐదెకరాల పొలం ఎండిపోయిందని ఆదవేదనతో చెప్పాడు. ప్రభుత్వం స్పందించి ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

పోచంపల్లిలోని ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల

హోమియో దవాఖానకు స్వీపరే దిక్కు

- 8నెలలుగా డాక్టర్ లేరు.. సిబ్బంది కరువు
- ప్రజలకు అందని వైద్య సేవలు

భూదాన్ పోచంపల్లి, మార్చి 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలలో 8నెలలుగా డాక్టర్ లేకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. దైనందిత జీవితంలో దీర్ఘకాల వ్యాధుల నివారణకు హోమియోపతి మందులు వాడే రోగుల సంఖ్య పెరిగింది. గతంలో ఈ వైద్యశాలలో సుమారు 150కి పైగా ఓపీ ఉండేది. ప్రస్తుతం వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చే రోగులు నిరాశతో వెనుతిరిగి పోతున్నారు. ఆస్పత్రిలో డాక్టర్, ఫార్మాసిస్ట్, కంపౌండర్, అటెండర్ ఎవరూ లేరు. ఆసుపత్రికి స్వీపర్ ఒక్కడే దిక్కయ్యాడు. అతను రోజూ వచ్చి ఆస్పత్రిని ఊడ్చి వెళ్తున్నాడు. గతంలో ఆలేరు మండలం కొలనుపాక హోమియో ఆసుపత్రికి చెందిన వైద్యురాలు లలిత డిప్యుటేషన్‌పై పోచంపల్లి దవాఖానలో గురు, శుక్ర, శని మూడు రోజులపాటు వైద్యసేవలు అందించేవారు. ఆమె గత సంవత్సరం జూలైలో మేడ్చల్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆసుపత్రికి డాక్టర్ లేరు. ఫార్మాసిస్ట్ పోస్టు నాలుగేండ్లుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన కంపౌండర్ రెండేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అటెండర్ రిటైర్డ్ అయి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదు. ప్రస్తుతానికి స్వీపర్ ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆరేండ్ల కిందట స్వైన్ ఫ్లూ సమయంలో హోమియోపతి వైద్యశాల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. ఇప్పుడు వైద్య సిబ్బంది లేకపోవడంతో హోమియో ఆసుపత్రికి ఎప్పుడూ తాళం వేసే ఉంటుంది. చాలామంది వైద్యం కోసం వచ్చి వెను తిరిగి పోతున్నారు. గత్యంతరం లేక ప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ డాక్టర్, వైద్య సిబ్బందిని నియమించి వైద్య సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు

హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌తో సుధీర్‌కుమార్

ఆలేరు రూరల్, మార్చి 14 : బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోజు శ్రవణకుమార్‌ను మండలంలోని సాయిగూడెం గ్రామానికి చెందిన గంగాధారి సుధీర్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామెల్

అడ్డగూడూరు, మార్చి 14 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని మానాయికుంట ఎక్స్ రోడ్ నుంచి వలిగొండ నేషనల్ హైవే వరకు 9కిలోమీటర్ల రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జోజి, మహిళా అధ్యక్షురాలు బొమ్మగాని అంజమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్ విద్యాసాగర్, నాయకులు సత్యనారాయణ, సైదులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో గుండ్లగూడెం వాసికి 8వ ర్యాంకు

ఆలేరు రూరల్, మార్చి 14 : టీజీపీఎస్‌సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మండలంలోని గుండ్లగూడెం గ్రామానికి చెందిన ముస్త్యాల సుగంధి సివిక్స్ విభాగంలో ఓపెన్ కేటగిరిలో 8వ ర్యాంకు సాధించింది. ప్రభుత్వ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికైన ఆమె హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ఆమె విధుల్లో చేరారు. సుగంధి తల్లిదండ్రులు ముస్త్యాల రవికుమార్, నిర్మల ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సుగంధికి, ఆమె తల్లిదండ్రులకు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఘనంగా హోలీ సంబురాలు

చౌటుప్పల్ : హోలీ వేడుకల్లో భాగంగా రామాలయం వద్ద ఉట్లు కొడుతున్న యువత



తుర్కపల్లి : బీల్యాతండాలో గిరిజనులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఐలయ్య

భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : హోలీ వేడుకలను జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. పలు గ్రామాల్లో ప్రజలు బ్యాండు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకున్నారు. చిన్నా, పెద్ద, మహిళలు తేడా లేకుండా రంగులు చల్లుకొని ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. భువనగిరి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు రంగులు చల్లుకుని వేడుకలను సంతోషంగా జరుపుకొన్నారు. చౌటుప్పల్ పట్టణంలో రామాలయం వద్ద ఉట్లు కొట్టారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని సంస్థాన్ నారాయణపురం మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు శివరాత్రి విద్యాసాగర్ హైదరాబాద్‌లో కలిసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. తుర్కపల్లి మండలంలోని బీల్యాతండాలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య గిరిజనులతో కలిసి హోలీ వేడుకలు జరుపుకొన్నారు.

యాదగిరిగుట్టలో హోలీ వేడుకల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటయ్య

రాజాపేట : హోలీ సంబురాల్లో పాల్గొన్న గ్రామస్తులు

గుండాల : పాచిల్ల గ్రామంలో హోలీ ఆడుతున్న చిన్నారులు

భువనగిరి అర్బన్ : రంగులు చల్లుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

తుర్కపల్లిలో హోలీ సంబురాల్లో బాలురు

ఆత్మకూరు(ఎం) : హోలీ ఆడుతున్న మహిళలు

వలిగొండ : లింగరాజుపల్లిలో హోలీ జరుపుకొంటున్న చిన్నారులు

భూదాన్ పోచంపల్లిలో హోలీ సంబురాల్లో స్థానిక మహిళలు

సంస్థాన్ నారాయణపురంలో హోలీ వేడుకల్లో చిన్నారుల కేరింతలు

రామన్నపేటలో హోలీ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం సభ్యులు

మోత్కూరు : పనకబండలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

భువనగిరిలో హోలీ సంబురాల్లో యువతులు

గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం మెరుగుకు కృషి

- ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం, మార్చి 14 : మండల వ్యాప్తంగా ప్రతి గ్రామానికి అనుసంధానంగా ఉన్న రోడ్లకు మహర్దశ కల్పించి రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని మాధారం కలాన్ గ్రామం నుంచి ఇటుకుల పహాడ్‌కు వెళ్లే రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాలను శుక్రవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పాదూరి శంకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ తాళ్లూరి మురళి, సుధాకర్ పాల్గొన్నారు.

యాపిల్ సాగుపై అవగాహన పెంచుకోవాలి : చంద్రశేఖర్‌రెడ్డి

యాపిల్ సాగును పరిశీలిస్తున్న హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

హాలియా, మార్చి 14 : యాపిల్ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం పులిమామిడి గ్రామంలో యాపిల్ సాగును శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రత్యామ్నాయ, ఆదాయాన్ని చేకూర్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బైకాని లక్ష్మయ్య, కోట నాగిరెడ్డి, నాగారాజు, హనుమంతు రెడ్డి, సైదులు ఉన్నారు.